క్లుప్తంగా

నేడు విద్యుత్ అంతరాయం

ఖమ్మంఅర్బన్: నగరంలోని శ్రీనగర్‌కాలనీ విద్యుత్‌లైన్ ఫీడర్ మరమ్మతుల దృష్ట్యా శనివారం ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని విద్యుత్ శాఖ ఏఈ చావా లక్ష్మణ్ ఒక ప్రకటనలో తెలిపారు. దీంతో శ్రీనగర్‌కాలనీ రోడ్డు నంబర్– 9 నుంచి 15 వరకు, సెంచరీ స్కూల్, రెజొనెన్స్ తదితర ప్రాంతాల్లో అంతరాయం ఉంటుందని, వినియోగదారులు సహకరించాలన్నారు.

25న కోటి దీపోత్సవం

ఖమ్మంగాంధీచౌక్: కార్తీక మాసం సందర్భంగా నగరంలోని సారథినగర్ ఎంబీ గార్డెన్స్ వద్ద ఉన్న శివాలయం సన్నిధిలో ఈ నెల 25న సాయంత్రం 6 గంటలకు కోటి దీపోత్సవ వార్షికోత్సవాన్ని నిర్వహిస్తున్నట్లు ఆలయ అర్చకుడు బ్రహ్మశ్రీ సత్తెనపల్లి ఉమామహేశ్వర రావు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. మహాశ్రీచక్రపీఠం వారి ఆధ్వర్యాన నిర్వహిస్తున్న ఈ కార్యక్రమాన్ని భక్తులు విజయవంతం చేయాలని కోరారు.

కొత్త స్వీపింగ్ మిషన్‌కు టెండర్లు

ఖమ్మంమయూరిసెంటర్: నగరంలో రోడ్లు ఊడ్చేందుకు టెండర్ల ద్వారా కొత్త స్వీపింగ్ మిషన్ కొనుగోలుకు అధికారులు కసరత్తు చేస్తున్నారు. వరంగల్ కార్పొరేషన్‌లో మాదిరిగా పూర్తి సాంకేతికతో కూడిన మిషన్‌ను ఏర్పాటు చేసుకుని రోడ్లను శుభ్రంగా ఉంచుకోవాలని అధికారులు నిర్ణయించినట్లు తెలిసింది.

కళాజాతా



ఊట్కూర్‌లో కళాజాతా నిర్వహిస్తున్న దృశ్యం

కామేపల్లి: తెలంగాణ ప్రభుత్వం ప్రవేశపెట్టిన అభివృద్ధి, సంక్షేమ పథకాలపై ప్రజాపాలన విజయోత్సవాల్లో భాగంగా సాంస్కృతిక సారథి కళాకారులు చాపలమడుగు కోటేశ్వరరావు కళా బృందం కళాజాతా నిర్వహించారు. మండలంలోని గోవింద్రాల, ఊట్కూర్, మద్దులపల్లి గ్రామాల్లో ఆటపాట కళారూపాల ద్వారా తెలియజేశారు. ఈ కార్యక్రమంలో కళాబృందం సభ్యులు మునగాల వెంకటరత్నం, బీరెల్లి రమణ, కొమ్ము రమేష్, బానోత్ రవి, మేడ ముత్తయ్య తదితరులున్నారు.

అవగాహన ర్యాలీ



ప్రభుత్వ ఆస్పత్రిలో విద్యార్థుల ర్యాలీ

ఖమ్మంవైద్యవిభాగం: ప్రపంచ వ్యాధి నిరోధక అవగాహన వీక్ సందర్భంగా శుక్రవారం మెడికల్ కళాశాల మైక్రోబయాలజీ విభాగం ఆధ్వర్యాన నగరంలో నిర్వహించిన ర్యాలీని కళాశాల ప్రిన్సిపాల్ ఎస్.రాజేశ్వరరావు ప్రారంభించారు. మెడికల్ కళాశాల నుంచి జెడ్పీసెంటర్ మీదుగా ప్రభుత్వ జనరల్ ఆస్పత్రి వరకు ర్యాలీ కొనసాగింది. ఈ సందర్భంగా రంగోళి కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆస్పత్రి సూపరింటెండెంట్ ఎల్. కిరణ్‌కుమార్, వైస్ ప్రిన్సిపాల్ సరిత, సృజన, మైక్రోబయాలజీ అధ్యాపక బృందం రమాదేవి, సమతరాణి, ప్రీతి, విద్యార్థులు పాల్గొన్నారు.

నగరంలో సినిమాలు

తిరుమల	దేవకీ నందన వాసుదేవ
వినోద	లక్కీ భాస్కర్
సాయిరాం	మెకానిక్ రాకీ
ఆదిత్య	రాధేకృష్ణ
శ్రీనివాస	అమరన్
సినీ గెలాక్సీ	జీబ్రా

– ఖమ్మంగాంధీచౌక్

ఖమ్మం రైతుబజార్, సమీకృత మార్కెట్

కూరగాయలు కేజీ ధర (రూ.ల్లో)		ఆకుకూరల కట్టలు (రూ.ల్లో)	
టమాట	44	బచ్చలికూర	3
వంకాయ	40		20
బెండకాయ	34	పాలకూర	3
పచ్చిమిర్చి	30		20
కాకర	34	చుక్కకూర	3
బోడ కాకర	120		20
బీర	58	తోటకూర	3
దొండ	30		20
పొట్లకాయ	38	గోంగూర	4
చిక్కుడు	70		20
గోరుచిక్కుడు	34	మెంతికూర	2
క్యాబేజీ	38		20
క్యాలీఫ్లవర్	30	కొత్తిమీర	1
ఆలుగడ్డ	40		40
చామగడ్డ	44	పుదీన	1
క్యారెట్	64		25
క్యాప్సికం	58	-ఖమ్మం వ్యవసాయం	

మార్గం.. సుగమం!



ఆయువు నింపిన 'ఆర్‌యూబీ'
- తీరనున్న మామిళ్లగూడెం- సారథినగర్ ప్రజల కష్టాలు
- ఆర్‌యూబీ నిర్మాణంతో హర్షాతిరేకాలు
- మరో వారం రోజుల్లో రాకపోకలు ప్రారంభం
- నెరవేరిన దశాబ్దాల కల

ఖమ్మం రాపర్తినగర్: దశాబ్దాల కలగా నిలిచిన మామిళ్లగూడెం-సారథినగర్‌ల మధ్య ఆర్‌యూబీ(రైల్వే అండర్ బ్రిడ్జి) నిర్మాణాన్ని మున్సిపల్, రైల్వే శాఖాధికారులు అన్ని రకాల అనుమతులతో ఎట్టకేలకు పూర్తి చేశారు. మరోవారం రోజుల్లో బ్రిడ్జి కింద నుంచి ద్విచక్ర వాహనాలు, నడకదారికి సుగమమైంది. ఎంతో మంది రైలు పట్టాలు దాటుతుండగా ప్రాణాలు కోల్పోయిన సంఘటనలు ఉన్నాయి. దీన్ని దృష్టిలో పెట్టుకుని 2007లో అప్పటి జిల్లా మంత్రి సంభాని చంద్రశేఖర్ నిధులు విడుదల చేశారు. కాని నిర్మాణ సమయాన కొంతమంది మామిళ్లగూడెం వాసులు ఇది దేవుడి మాన్యం అని కోర్టుకెక్కారు. దీంతో పనులు నిలిచిపోయాయి.

పూర్తయిన అండర్ బ్రిడ్జి నిర్మాణం

నీరు నిల్వ లేకుండా..

వర్షా కాలంలో బ్రిడ్జి కింద నీళ్లు ఆగకుండా ఉండేందుకు అధికారులు ముందస్తు చర్యలు తీసుకున్నారు. కాగా, గంటల కొద్ది వర్షం పడితే మాత్రం బ్రిడ్జి కింద వర్షం నీరు నిలిచే ప్రమాదం ఉందనేది ఆప్రాంత వాసులు అంటున్నారు. ఏదిఏమైనా బ్రిడ్జి నిర్మాణం పూర్తికావడంతో ఆప్రాంత ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఎన్నో ఏళ్లుగా నిర్మాణం కొనసాగకపోవడంతో ఎంతో మంది ప్రాణాలు కోల్పోయారని, ఇప్పటికైనా పూర్తి చేయటం శుభపరిణామం అంటున్నారు.

అన్ని అనుమతులతో..

నిలిచిపోయిన బ్రిడ్జి నిర్మాణ పనులను మళ్లీ మొదలు పెట్టేందుకు మున్సిపాల్ శాఖ, రైల్వే శాఖలు ముందుకొచ్చాయి. దీంతో ఆ ప్రాంత వాసులకు పనులకు అభ్యంతరం తెలిపారు. తాజాగా ఏడాది పైగా అన్ని రకాల పర్మిషన్లను పొందిన మున్సిపాల్ శాఖ ఎట్టకేలకు నిర్మాణాన్ని పూర్తి చేసింది. అప్పటికే బ్రిడ్జి నిర్మాణం పూర్తయిన కొద్ది రోజుల్లోనే బ్రిడ్జి కిందినుంచి రాకపోకలను నిలిపివేశారు. గత కొంత కాలంగా పనులను యుద్ధప్రాతిపదికన కొనసాగడం వల్ల రాకపోకలకు అంతరాయం లేకుండా చేస్తున్నారు.

పారిశుద్ధ్యంపై ప్రణాళికలు సిద్ధం చేయండి

- రోడ్లు, డ్రెయిన్లపై ఆక్రమణలను తొలగించండి
- అధికారుల సమీక్షా సమావేశంలో కేఎంసీ కమిషనర్ అభిషేక్ అగస్త్య



మాట్లాడుతున్న కేఎంసీ కమిషనర్ అభిషేక్ అగస్త్య

ఖమ్మంమయూరిసెంటర్: పారిశుద్ధ్య పనులపై ఓ నిర్దిష్ట ప్రణాళికల లేకపోతే నగరంలో పారిశుద్ధ్యం మెరుగుపడదని కేఎంసీ కమిషనర్ అభిషేక్ అగస్త్య అన్నారు. శుక్రవారం కేఎంసీ సమావేశ మందిరంలో శానిటేషన్, టౌన్‌ప్లానింగ్, ఇంజనీరింగ్ విభాగాల అధికారులతో నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఆయన మాట్లాడారు. డివిజన్లలో డిసెంబర్ 10 వరకు పారిశుద్ధ్య పనుల నిర్వహణపై ప్రణాళికలను సిద్ధం చేయాలని సూచించారు. పారిశుద్ధ్యం మెరుగుపడకుంటే ఎస్ఐలు, సూపర్‌వైజర్‌లపై చర్యలు ఉంటాయని హెచ్చరించారు. నగరంలో రోడ్లు, డ్రెయిన్లను ఆక్రమించి చేపట్టిన నిర్మాణాలను తొలగించాలని టౌన్ ప్లానింగ్ అధికారులను ఆదేశించారు. ముందు ఆక్రమణలను గుర్తించి, వాటిని తొలగించేందుకు యాక్షన్‌ప్లాన్ సిద్ధం చేయాలన్నారు. వీధుల్లో వెలగని వీధి దీపాలు, వాటర్ లీకేజీలు, కల్వర్టుల డ్యామేజీలు గుర్తించి వాటి మరమ్మతులకు అవసరమైన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ట్రెయినీ కలెక్టర్ మ్రినాల్ శ్రేష్ఠ, అసిస్టెంట్ కమిషనర్ అహ్మద్ షఫీ ఉల్లా, ఈఈ కృష్ణాలాల్, ఏసీపీ వసుందర తదితరులు పాల్గొన్నారు.

ఎల్ఆర్ఎస్ దరఖాస్తుల పరిశీలన వేగవంతం చేయండి..

సుడా పరిధిలో ఎల్ఆర్ఎస్ దరఖాస్తుల పరిశీలన వేగవంతం చేయాలని కేఎంసీ కమిషనర్, సుడా వైస్ చైర్మన్ అభిషేక్ అగస్త్య అధికారులను ఆదేశించారు. కేఎంసీలో ఎల్ఆర్ఎస్ దరఖాస్తులపై సమీక్షించిన ఆయన మాట్లాడుతూ దరఖాస్తుల పరిశీలనలో ఏమైనా సమస్యలు ఉంటే తన దృష్టికి తీసుకురావాలన్నారు.

ఆర్‌యూబీ పరిశీలన..

నగరంలోని సారథినగర్–మామిళ్లగూడెం ప్రాంతాల మధ్యలో నిర్మించిన రైల్వే అండర్ బ్రిడ్జిని కమిషనర్ అభిషేక్ అగస్త్య, అసిస్టెంట్ కమిషనర్ అహ్మద్ షఫీఉల్లా, ఈఈ కృష్ణాలాల్‌తో కలిసి పరిశీలించారు. అండర్ పాస్‌కు ఇరువైపుల చెత్త పేరగకుండా చూడాలని, ప్రయాణికుల కోసం లైటింగ్ ఏర్పాటు చేసి ప్రారంభానికి సిద్ధం చేయాలన్నారు.

నగరంలో మాజీ మంత్రుల పర్యటన



మాజీ మంత్రులు, ఎంపీని సన్మానిస్తున్న తోట రామారావు, పక్కన డాక్టర్ లక్ష్మణ్

ఖమ్మం మయూరిసెంటర్/ఖమ్మం మామిళ్లగూడెం /ఖమ్మం లీగల్: జిల్లా పద్మనాయక వెలమ అసోసియేషన్ ఆధ్వర్యాన రూపొందించిన 2025 సంవత్సరం క్యాలెండర్లను మాజీ మంత్రులు తన్నీరు హరీశ్‌రావు, పువ్వాడ అజయ్‌కుమార్ శుక్రవారం ఖమ్మంలో ఆవిష్కరించారు. అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు సాగి వెంకటేశ్వరరావు, గుమ్మడపు మురళీధర్‌రావు, ఉసరికపల్లి రమేష్‌రావు, పి.వెంకటేశ్వరావు, హన్మంతరావు తదితరులు పాల్గొన్నారు. కాగా, ఖమ్మం వ్యవసాయ మార్కెట్‌కు వచ్చిన మాజీ మంత్రులు హరీశ్‌రావు, గంగుల కమలాకర్ తదితరులకు మాజీ ఎమ్మెల్యే బానోత్‌చంద్రావతి పుష్పగుచ్ఛాలు అందజేసి స్వాగతం పలికారు. కాగా, ఖమ్మం వైరా రోడ్డులో ఇటీవల ప్రారంభించిన టీఆర్ఆర్ ఆర్థో, యాక్సిడెంట్ కేర్ యూనిట్‌ను మాజీ మంత్రులు హరీశ్‌రావు, గంగుల కమలాకర్, ఎంపీ వద్దిరాజు రవిచంద్ర తదితరులు సందర్శించారు. డాక్టర్ తోట లక్ష్మణ్ కుమార్, తోట రమేష్‌తో పాటు వారి తల్లిదండ్రులు రామారావు, గోవిందమ్మకు శుభాకాంక్షలు తెలిపారు. అలాగే, బీఆర్ఎస్ లీగల్ సెల్ ఆధ్వర్యాన పలు సమస్యలపై హరీశ్ రావుకు వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో బిచ్చాల తిరుమలరావు, కొత్త వెంకటేశ్వరరావు, మేకల సుగుణరావు, దిలీప్ చౌదరి, నిరోషా, షేక్ ముల్తార్ తదితరులు పాల్గొన్నారు.

మాలల 'సింహగర్జన' పోస్టర్లు ఆవిష్కరణ



పోస్టర్లు ఆవిష్కరిస్తున్న నాయకులు

తిరుమలాయపాలెం: వచ్చే నెల ఒకటవ తేదీన సికింద్రాబాద్ పరేడ్ గ్రౌండ్‌లో జరిగే మాలల బహిరంగ సభను జయప్రదం చేయాలని ఆ సంఘం నాయకులు అన్నారు. ఈమేరకు శుక్రవారం తిరుమలాయపాలెంలో సభకు సంబంధించిన పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాల మహానాడు జిల్లా కార్యదర్శి గుమ్మడి కనకరాజు మాట్లాడుతూ.. మాలలకు అన్యాయం జరిగేలా న్యాయస్థానాలు తీర్పు ఇవ్వడం అన్యాయమని, దీన్ని వ్యతిరేకించాలని కోరారు. సభకు వేలాదిగా తరలిరావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో నాయకులు దాసరి శ్రీనివాస్ మెట్టు వెంకటేశ్వర్లు, పప్పుల ప్రసాద్, మహేందర్, నూకతొట్టి సాల్మన్, పప్పుల ఉపేందర్ తదితరులు పాల్గొన్నారు.

న్యాయవాదికి 'మాలతి' పురస్కారం



సమావేశంలో మాట్లాడుతున్న నిర్వాహకులు

ఖమ్మంగాంధీచౌక్: నగరంలోని భక్త రామదాసు కళాక్షేత్రంలో ఆదివారం సాయంత్రం నిర్వహించనున్న 88వ నెలనెలా అభ్యుదయ సాంస్కృతిక కదంబం కార్యక్రమంలో నాగబత్తిని మాలతి జీవిత సాఫల్య పురస్కారాన్ని నగరానికి చెందిన న్యాయవాది వనం కృష్ణవేణికి అందిస్తున్నట్లు ఖమ్మం కళాపరిషత్ అధ్యక్షుడు డాక్టర్ నాగబత్తిని రవి, అమరజీవి అన్నాబత్తుల రవీంద్రనాథ్, కళా సాంస్కృతిక సంస్థ(ఆర్క్స్) కార్యదర్శి ఏఎస్ కుమార్‌లు తెలిపారు. శుక్రవారం స్థానిక భక్త రామదాసు కళాక్షేత్రంలో నెల నెలా వెన్నెల నిర్వాహకులు నిర్వహించిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. ప్రతి ఏటా నవంబర్‌లో రిటైర్డ్ బ్యాంక్ ఉద్యోగి నాగబత్తిని మాలతి వర్ధంతి సందర్భంగా ఈ పురస్కారాన్ని అందిస్తున్నామన్నారు. అంతేకాక 100 మంది పేద మహిళలకు చీరలు పంపిణీ చేయనున్నట్లు తెలిపారు. ఈ సమావేశంలో ఖమ్మం కళా పరిషత్ కార్యదర్శి వేల్పుల విజేత, ఆర్క్స్ అధ్యక్షులు మోటమర్రి జగన్మోహన్‌రావు, దేవేంద్ర, ప్రజా నాట్యమండలి జిల్లా కార్యదర్శి వేముల సదానందం తదితరులు పాల్గొన్నారు.

విద్యారంగ సమస్యలపై నిర్లక్ష్యం తగదు



సమావేశంలో మాట్లాడుతున్న విజయ్

ఖమ్మం మామిళ్లగూడెం: విద్యారంగ సమస్యలపై నిర్లక్ష్యం తగదని టీపీటీఎఫ్ జిల్లా కార్యదర్శి విజయ్, మాజీ పీడీఎస్‌యూ జిల్లా నాయకులు ధరణికృష్ణ అన్నారు. శుక్రవారం ఎస్ఆర్అండ్‌బీజీఎన్ఆర్ డిగ్రీ కళాశాలలో జరిగిన సమావేశంలో వారు మాట్లాడారు. ఖమ్మం జిల్లా జనరల్ యూనివర్సిటీ హామీపై జిల్లా మంత్రులు ప్రస్తావన తీసుకురాకపోవడం దురదుష్టకరమని, విద్యారంగ సమస్యలను పట్టని ప్రభుత్వాలను తెలంగాణ సమాజం విస్మరిస్తుందన్నారు. లక్ష్మణ్ అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో నాయకులు వెంకటేశ్, వినయ్, శ్రీను, పృథ్వి, సందీప్, నేందర్, లాల్‌పాషా, కావ్య, నాజియా, సమీర్, సాదక్, ఉదయ్, గణేష్, నరేందర్, నిఖిల్ తదితరులు పాల్గొన్నారు.

చెరుకు రైతుల బలోపేతమే లక్ష్యం



అనంతనగర్‌లో చెరుకు నాటిన పొలాన్ని పరిశీలిస్తున్న ఫ్యాక్టరీ బాధ్యులు

నేలకొండపల్లి: చెరుకు రైతుల బలోపేతమే లక్ష్యంగా చెరుకు టన్ను ధర రూ.3,400 ప్రకటించిదని మండలంలోని రాజేశ్వరపురం మధుకాన్ షుగర్ అండ్ పవర్ ఇండస్ట్రీస్ అసిస్టెంట్ వైస్ ప్రెసిడెంట్ కోటయ్య తెలిపారు. శుక్రవారం ఫ్యాక్టరీ పరిధిలోని పలు గ్రామాల్లో చెరుకు సాగుపై కలిగే దిగుబడులపై రైతులకు అవగాహన కల్పించిన సందర్భంగా ఆయన మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం నిర్ణయించిన ధర కంటే రూ.116 అదనంగా ఇస్తున్నామని, కొత్తగా చెరుకు నాటే రైతులకు ఎకరానికి మూడు టన్నుల విత్తనం ఉచితంగా అందించి ప్రతీ టన్ను దిగుబడికి పావుకేజీ పంచదార ఉచితంగా ఇవ్వనున్నట్లు తెలిపారు. ఇతర రాష్ట్రాల నుంచి కొత్త రకం చెరుకు విత్తనం తెచ్చే వారికి ఎకరానికి రవాణా రాయితీ కింద రూ.1,800 అందిస్తామన్నారు. నూతన వ్యవసాయ విధానాలను తెలియజేసేందుకు శాస్త్రవేత్తల ద్వారా ప్రతీ మూడు నెలలకోసారి అవగాహన సదస్సులను నిర్వహిస్తున్నామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో డీజీఎం అప్పారావు, అసిస్టెంట్ కేన్ కమిషనర్ రవీందర్‌రావు, ఫ్యాక్టరీ హెచ్ఆర్ నరేష్, శాస్త్రవేత్తలు, రైతులు తదితరులు పాల్గొన్నారు.

'అంగన్‌వాడీ'ల అవస్థలు



ఆటోలో తీసుకొచ్చిన మెటీరియల్‌తో టీచర్లు

నేలకొండపల్లి: తిరుమలాయపాలెం ఐసీడీఎస్ ప్రాజెక్ట్ పరిధిలోని అన్ని అంగన్‌వాడీ కేంద్రాలకు బల్లలు, రౌండ్ టేబుల్, కార్నర్ బుక్స్ బీరువా తదితర మెటీరియల్‌ను సరఫరా చేశారు. అయితే వీటన్నింటిని కూసుమంచి కేంద్రంగా అందిస్తుండడంతో శుక్రవారం వాటిని తీసుకొచ్చేందుకు అంగన్‌వాడీ టీచర్లు ఒక్కో ఆటోకు రూ.500 నుంచి రూ.700 వరకు కిరాయి ఇచ్చి తెచ్చుకోవాల్సి వచ్చింది. దీంతో ఐసీడీఎస్ అధికారుల తీరుపై అంగన్‌వాడీ యూనియన్ నాయకులు మండిపడి అసలే అరకొర వేతనాలు... ఆపై చార్జీలు ఎందంటూ ప్రశ్నిస్తున్నారు. కనీసం ఆటోల కిరాయిలు చెల్లించాలన్నారు.

'డేర్'కు ఎన్‌సీసీ మంజూరు

ఖమ్మంరూరల్: మండలంలోని సత్యనారాయణపురంలో గల డేర్ ఇంజనీరింగ్ కలాశాలకు ఎన్‌సీసీ విభాగం శుక్రవారం మంజూరైనట్లు కళాశాల ప్రిన్సిపాల్ దరిపల్లి కిరణ్‌కుమార్ తెలిపారు. కళాశాలలోని పాలిటెక్నిక్ డిప్లొమా, బీటెక్ విద్యార్థులకు ఈ విభాగాన్ని సద్వినియోగం చేసుకుని ఉత్తమ ప్రతిభ కనబర్చితే తమ తోడ్పాటు ఎల్లప్పుడూ ఉంటుందన్నారు. నేడు ఎస్ఆర్అండ్‌బీజీ ఎన్ఆర్ కళాశాలలో జరిగే ఎన్‌సీసీలో విద్యార్థులు కష్టపడి తమ ప్రతిభను కనబర్చాలని సూచించారు. ఈ కార్యక్రమంలో దరిపల్లి శిరీష, రవి, రమేష్, నవీన్, నర్సింహారావు, రామయ్య తదితరులు పాల్గొన్నారు.

పార్క్ నిర్మాణానికి అడ్డంకులు

ఖమ్మంమయూరిసెంటర్: నగరంలోని ప్రతీ డివిజన్ పరిధిలో పార్క్‌ల నిర్మాణం కోసం కేఎంసీ అధికారులు, పాలకులు చర్యలు చేపట్టారు. దానిలో భాగంగా ఇప్పటికే అన్ని డివిజన్లలో పార్క్‌ల నిర్మాణాలను పూర్తి చేసి, ఓపెన్ జిమ్‌లను ఏర్పాటు చేశారు. అయితే 54వ డివిజన్‌లో మాత్రం పార్క్ లేకపోవడం, స్థానిక ప్రజలు, పిల్లలు పార్క్‌కు వెళ్లాలంటే ఇతర డివిజన్‌లలోని పార్క్‌ల వద్దకు వెళ్లాల్సి వస్తుంది. దీంతో స్థానిక కార్పొరేటర్ వినతి మేరకు కేఎంసీ అధికారులు డివిజన్‌లోని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క క్యాంపు కార్యాలయం పక్కన ఉన్న ప్రభుత్వ స్థలాను కేటాయించి, పార్క్ నిర్మాణానికి టెండర్లు ఖరారు చేశారు. అయితే సదరు స్థలం జాతీయ రహదారుల సంస్థకు చెందినదిగా ఆ శాఖ అధికారులు పార్క్ నిర్మాణం జరగకుండా అడ్డుకుంటున్నట్లు తెలుస్తోంది. శుక్రవారం పార్క్ నిర్మాణ పనులను ప్రారంభించేందుకు కాంట్రాక్టర్, అధికారులు అక్కడకు వెళ్లగా.. జాతీయ రహదారుల సంస్థ అధికారులు పనులను అడ్డుకున్నట్లు తెలిసింది. ప్రభుత్వం నుంచి జీఓ వస్తేనే ఈ స్థలాన్ని కేఎంసీకి అప్పగిస్తామని, లేకుంటే తమ భవనాలు నిర్మించుకుంటామని సదరు అధికారులు తేల్చిచెప్పడంతో పార్క్ నిర్మాణ పనులను ప్రారంభించకుండానే వెనుదిరిగారు.

24 నుంచి చండీయాగం

ఖమ్మంగాంధీచౌక్: సహస్ర చండీ సహిత మహా రుద్ర యాగాన్ని ఈ నెల 24 నుంచి 29వ తేదీ వరకు నగరంలోని మమత రోడ్‌లో గల జీ ఫ్లెక్స్, ఫైవ్ ఎలిమెంట్స్ వద్ద నిర్వహిస్తున్నట్లు యాగకర్త దండ్యాల లక్ష్మణ్‌రావు, గుర్రం మురళిలు శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. లోక కల్యాణం కోసం ఈ సహస్ర యాగాన్ని నిర్వహిస్తున్నట్లు వివరించారు. ఆరు రోజుల పాటు జరిగే ఈ యాగంలో ప్రత్యేక హోమ పూజలతో పాటు తీర్థ ప్రసాదాల వితరణ కార్యక్రమాలు ఉంటాయని, భక్తులు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. యోగంలో పాల్గొనదలచిన భక్తులు 77020 48983ను సంప్రదించాలన్నారు.

'ఉపాధి' పనులపై అదనపు కలెక్టర్ సమీక్ష



డేటా ఎంట్రీని పరిశీలిస్తున్న అదనపు కలెక్టర్

కూసుమంచి: కూసుమంచి ఎంపీడీఓగా బాధ్యతలు చేపట్టిన అదనపు కలెక్టర్ మృణాల్ శ్రేష్ఠ శుక్రవారం పలు అంశాలపై సమీక్షించారు. శిక్షణలో భాగంగా మండలంలో కొనసాగుతున్న జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం పనులపై సమీక్షించి కూలీల మస్టర్లను తనిఖీ చేశారు. కంప్యూటర్‌లో వర్క్ పేమెంట్ ఎన్ఐసీ లాగిన్‌ను పరిశీలించారు. అనంతరం మండలంలో కొనసాగుతున్న సమగ్ర కుటుంబ సర్వే డేటా ఎంట్రీని పర్యవేక్షించారు. ఎంపీడీఓ వేణుగోపాల్‌రెడ్డి మండలంలోని పలు అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాల వివరాలను అదనపు కలెక్టర్‌కు వివరించారు.

పెండింగ్ సమస్యలు పరిష్కరించాలి



సమావేశంలో మాట్లాడుతున్న మనోహర్‌రాజు

ఖమ్మం సహకారనగర్: జిల్లా విద్యాశాఖాధికారి కార్యాలయంలో నెలకొన్న పెండింగ్ సమస్యలను వెంటనే పరిష్కరించాలనిటీపీటీఎఫ్ జిల్లా కమిటీ పేర్కొంది. శుక్రవారం నగరంలోని సంఘం కార్యాలయంలో సంఘం జిల్లా అధ్యక్షుడు ఏవీ నాగేశ్వరావు అధ్యక్షతన జరిగిన సమావేశంలో నాయకులు మనోహర్‌రాజు, ఎస్ విజయ్‌లు మాట్లాడారు. బదిలీలలో అక్రమాలు జరిగినా డీఈఓ చర్యలు తీసుకోవడంలో జాప్యం చేస్తున్నారని, నూతన ఉపాధ్యాయులు నియామకమైన స్థానాల్లో డిప్యూటేషన్ ఉపాధ్యాయులను రిలీవ్ చేయాలని, ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా ఉత్తమ ఉపాధ్యాయులను సన్మానించకుండా తాత్సారం చేస్తున్నారని ఆరోపించారు. పెండింగ్‌లో ఉన్న డీఏలు, పీఆర్సీలను ప్రకటించాలన్నారు. సమస్యలు పరిష్కరించకుంటే ఆందోళన చేస్తామని హెచ్చరించారు. సమావేశంలో జిల్లా నాయకులు ముత్తయ్య, వెంగళరావు, నాగిరెడ్డి, యాకూబ్ పాషా, సంధ్యారాణి, ఉమాదేవి తదితరులు పాల్గొన్నారు.

'ఎస్ఆర్‌బీజీఎన్ఆర్'లో రక్తదానం



రక్తదానం చేస్తున్న ఎన్‌సీసీ కేడెట్లు

ఖమ్మం రాపర్తినగర్: ఎన్‌సీసీ దినోత్సవాన్ని పురస్కరించుకుని నగరంలోని ఎస్ఆర్అండ్‌బీజీఎన్ఆర్ కళాశాలలో 11వ తెలంగాణ బెటాలియన్ ఆధ్వర్యాన రక్తదాన శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎండీ. జకీరుల్లా మాట్లాడుతూ.. 18 ఏళ్లు నిండిన ప్రతి ఒక్కరూ రక్తదానం చేయాలన్నారు. తర్వాత ఎన్‌సీసీ 11వ తెలంగాణ బెటాలియాన్ కల్నల్ ఎస్.కె.భద్రం మాట్లాడుతూ.. రక్తదానం చేసేందుకు కళాశాల బాధ్యులు విద్యార్థులను ప్రోత్సాహించాలని, ఇలాంటి కార్యక్రమాల్లో ఎన్‌సీసీ కేడెట్లు ముందుంటారన్నారు. అనంతరం కళాశాల నుంచి ర్యాలీ నిర్వహించి అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఎన్‌సీసీ అడ్మినిస్ట్రేటివ్ అధికారి కల్నల్ నవీన్‌యాదవ్, జేసీఓ రాజారాం, కళాశాల అధ్యాపకులు సీతారామారావు, బానోత్ రెడ్డి, కేఎల్ శాస్త్రి, రమాసత్యవతి, విజయ్‌కుమార్, కవిత, ఇంద్రాణి, శ్రీనివాస్, సునీత, పూర్ణచందర్‌రావులు పాల్గొన్నారు.

ప్రభుత్వ ఆస్పత్రిని బలోపేతం చేయాలి



ఆర్ఎంఓతో చర్చిస్తున్న నాయకులు

ఖమ్మంవైద్యవిభాగం: ప్రైవేట్, కార్పొరేట్ ఆస్పత్రిలో ఫీజుల దోపిడీని అరికట్టాలని, ప్రభుత్వ ఆస్పత్రిని బలోపేతం చేయాలని డిమాండ్ చేస్తూ పీవైఎల్, పీఓడబ్ల్యూ సంఘం నాయకులు డిమాండ్ చేశారు. శుక్రవారం ఖమ్మం పెద్దస్పత్రిలో సర్వే చేసి పేషెంట్లతో మాట్లాడాక ఆస్పత్రి ఆర్ఎంఓ డాక్టర్ రాంబాబు, నర్సింగ్ సూపరింటెండెంట్ ఇందిరకు సమస్యలను వివరించారు. దీంతో వారు సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తామన్నారు. ఈ సందర్భంగా పీవైఎల్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎస్‌వీ రాకేష్, పీఓడబ్ల్యూ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు గోకినపల్లి లలిత, ఆవుల మంగతాయిలు మాట్లాడుతూ ప్రభుత్వ ఆస్పత్రిలో మెరుగైన వైద్యం అందకే ప్రజలు 'ప్రైవేట్'బాట పట్టి ఫీజుల దోపిడీకి గురవుతున్నారన్నారు.డయాగ్నస్టిక్ సెంటర్లపై, మెడికల్ మాఫియాపై ప్రభుత్వ నియంత్రణ ఉండాలని, ప్రైవేట్ కార్పొరేట్ ఆస్పత్రుల ఫీజుల దోపిడీని అరికట్టాలని వారు డిమాండ్ చేశారు. ప్రభుత్వ ఆస్పత్రిలో ఖాళీగా ఉన్న డాక్టర్లు, నర్సులు, ల్యాబ్ టెక్నీషియన్ ఇతర సిబ్బంది పోస్టులు భర్తీ చేయాలని, అన్ని రకాల మందులు, టెస్టులు, స్కానింగ్ ప్రభుత్వ ఆస్పత్రిలోనే సౌకర్యం కల్పించాలని, లేనిఝెడల పెద్ద ఎత్తున ఉద్యమాలు నిర్వహిస్తామని ప్రభుత్వాన్ని హెచ్చరించారు. ఈ సర్వేలో పీఓడబ్ల్యూ జిల్లా ఉపాధ్యక్షురాలు టి.ఝాన్సీ, జిల్లా సహాయ కార్యదర్శి శోభ, నాయకులు మామిడాల వెంకటేష్, గోకినపల్లి సరోజిని, గొడ్డేటి అశోక్ పాల్గొన్నారు.




అటెన్షన్ ప్లీజ్

భగీరథకు లీకు..!

మండలంలోని వేపకుంట్లలో గత నాలుగు రోజులుగా మిషన్ భగీరథ జలం లీకవుతోంది. ఊరి చివరన పైప్‌లైన్ వాల్ వద్ద జలం విరజిమ్ముతూ నీరంతా వృథాగా పోతుందని గ్రామస్తులు తెలిపారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు తాగు నీరు వృథా కాకుండా తగు చర్యలు తీసుకుని ప్రజల దాహార్తిని తీర్చాలని పలువురు కోరుతున్నారు.

– రఘునాథపాలెం



వేపకుంట్లలో లీకవుతున్న భగీరథ జలం

మీకు సాక్షి దినపత్రిక అందడంలో ఏమైనా ఇబ్బందులున్నా, లేక సాక్షికి బదులుగా ఇతర దిన పత్రికలు వేస్తున్న యెడల ఈ ఫోన్ నెంబర్లకు ఉదయం 7-00 గం॥ల నుండి రాత్రి 8-00 గం॥ల లోపు తెలుపగలరు. వెంటనే చర్యలు తీసుకోబడును.

రమేష్, ACO - 9059115968
ఖమ్మం ఎన్. ఉపేందర్ - 99591 24151
పాలేరు ఎం. రామకృష్ణ - 85220 39990
వైరా ఐ. రాందాస్ - 98898 81843
మధిర వీరబాబు - 98498 64638
సత్తుపల్లి జి. బాబు - 79979 58225
టోల్‌ఫ్రీ నెం. : 1800 270 1083

సాక్షి
పాఠక మహాశయులకు విజ్ఞప్తి
Land Line : 08742-282823 / 24

మీరు సాక్షిలో వివాహ, జన్మదిన, పదవీ విరమణ, విదేశీ పర్యటన, స్వదేశాగమనం, అవార్డు గ్రహీతలకు శుభాకాంక్షలు, మీ ఆత్మీయులకు శ్రద్ధాంజలి, వ్యాపార, ఉద్యోగ ప్రకటనలు, బహిరంగ ప్రకటనలు, అతి తక్కువ ఖర్చుతో కొండత స్పందన లభించే క్లాసిఫైడ్ యాడ్స్ ఇవ్వదలచినచో మీరు సంప్రదించవలసిన ఫోన్ నెంబర్లు : ఎన్. నాగశేషు, యాడ్స్ మేనేజర్- 99122 20600

ఎన్. శేషయ్య - 99121 99148
జి. నర్సింహారెడ్డి - 97054 44181
ఎస్.కె. పాషా - 97054 44182
పి. నందకుమార్ - 90102 99957